కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..)టమాటా.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 95, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు తార్నాకలో 11వ మూలం సంత

లాలాపేట: ప్రకృతి–గ్రామీణ ఉత్పత్తులతో 11వ మూలం సంతను శనివారం తార్నాకలోని మర్రి కృష్ణాహాల్లో ఏర్పాటు చేసినట్లు గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. ఈ సంత ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ డీన్ డాక్టర్. పి. వి రావు, దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయ శిక్షణా నిపుణులు బసంపల్లి తదితరులు ముఖ్యతిథులుగా హాజరైతున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రకృతి, పాడి, సాహిత్యం, కుల వృత్తులను, చేతి వృత్తులను ప్రోత్సహించ దానికి తార్నాక పరిసర ప్రాంతాల ప్రజలు ఈ మూలం సంతను ఆదరించాలని కోరారు. వివరాలకు 9490850766 నెంబరుకు ఫోన్‌చేయాలన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, జిల్లా సమరచన ప్రభారి శ్రీ కాంతారావులు నూతన కార్యవర్గాన్ని వెల్లడించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులుగా రామంచ మహేష్, ప్రధాన కార్యదర్శులుగా బంధం కిరణ్, ఎం. శ్రీకాంత్(నైనేశ్), ఉపాధ్యక్షులుగా బినపల్లి పరమేష్, ఎన్. నర్సమ్మ, డి. అరుణ్ కుమార్, ఆర్. సెల్వరాజ్, ఎం. కొండల్‌రావులు ఎంపికయ్యారు. కార్యదర్శులుగా ఎ. గణేష్, పి. పరమేశ్వర్, జె. హిమబిందు, కె. శ్రవణ్‌రాజ్, కోశాధికారిగా ఎ. మాధవిలతో పాటు కార్యవర్గ సభ్యులుగా డి. శ్రీకర్, జి. రమేష్, చంద్రపాల్‌రెడ్డి, ఎం. భాస్కర్ తదితరులను నియమించారు.

రేపు విశాల్ జాగరణ్



విశాల్ జాగరణ్ కార్యక్రమం కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: మావైష్ణో దేవి జాగరణ్ మండల్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మా భగవతి 21వ విశాల్ జాగరణ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాగరణ్ మండల్ అధ్యక్షుడు సురేందర్ జోషి తెలిపారు. శుక్రవారం జింఖానా మైదానంలో మీడియాతో మాట్లాడుతూ రాత్రి 8.30 నుండి జాగరణ్ ప్రారంభమవుతుందని రాత్రంతా కొనసాగుతుందని చెప్పారు. జమ్ము కాట్రా లోని వైష్ణవి మాత ఆలయం ప్రధాన అర్చకులు అఖండ జ్యోతి వెలిగించి ఈ కార్యక్ర మం ప్రారంభిస్తారని అన్ని పార్టీల రాజకీయ ప్రముఖులు, హిందు బంధువులు హాజరవుతున్నారని చెప్పారు.

ఆస్తిలో వాటా కోసం మహిళల నిరసన

సనత్‌నగర్: తమ పుట్టింటి ఆస్తిలో వాటాకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తమను ఆ ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారంటూ ఇద్దరు మహిళలు ఎస్సార్‌నగర్‌లోని బాపునగర్ కమ్యూనిటీ హాల్ గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. బాపునగర్ బస్తీలో తమ సోదరుడు మహేష్ బాబు ఉంటున్న ఇంట్లో తమకు కూడా వాటా ఉందని శశిరేఖ (38), కీర్తి రాథోడ్(35) పేర్కొన్నారు. కోర్టు కూడా ముగ్గురికి సమాన వాటాను నిర్దేశిస్తూ తీర్పును వెలువరించిందన్నారు. అయినా తమను ఇంట్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నాడని.

బిహార్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎన్ఎస్‌యూఐ నాయకులు బీహార్ ఎన్‌డీఏ (బీజేపీ, ఆర్‌ఎస్ఎస్, జేడీయూ) ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. బీహర్ రాష్ట్రంలోని దర్భంగాలో దళిత విద్యార్థులు వసతి గల అంబేడ్కర్ హాస్టల్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ సభను ఎడీఏ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షులు మోడా శ్రీను తెలిపారు.

'గాంధీ'లో వైద్యంపై జాతీయ బృందం ఆరా

రోగుల డిజిటల్ రికార్డులు నమోదుపై అధ్యయనం ● స్కాన్ అండ్ షేర్ ద్వారా వేగవంతమైన ఓపీ పై ఆరా



పలు రాష్ట్రాలకు చెందిన నోడల్ అధికారులతో గాంధీ పాలనయంత్రాంగం

గాంధీఆస్పత్రి: కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆయుష్మాన్ భారత్ (అభా) డిజిటల్ మిషన్ వర్క్ షాప్‌లో భాగంగా దేశంలోని పద్దెనిమిది రాష్ట్రాలకు చెందిన నోడల్ అధికారులు శుక్రవారం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిని సందర్శించారు. గాంధీఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలు, రికార్డుల డిజిటల్ నిర్వహణ, వేగవంతమైన ఓపీడీ, స్కాన్ అండ్ షేర్ విధానం, ల్యాబోరేటరీ డిజిటలైజేషన్ తదితర అంశాలను పరిశీలించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారీ, ఆర్ఎంఓ–1 శేషాద్రి, గాంధీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణచక్రవర్తిలు గాంధీఆస్పత్రి అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలపై వివిధ రాష్ట్రాలకు చెందిన నోడల్ అధికారులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. రోగుల రికార్డులు డిజిటలైజేషన్ ద్వారా వారి పూర్తి ఆరోగ్య వివరాలు, అందించిన వైద్యసేవలు, మందులు, ల్యాబ్ నివేదికలు వంటి అంశాలు రోగి మొబైల్ నంబరుకు అనుసంధానం చేయడంతో దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్నా సింగిల్ క్లిక్ ద్వారా పొందవచ్చని.. వందశాతం డిజిటలైజేషన్‌కు కృషి చేస్తున్నామని వివరించారు. స్కాన్ అండ్ షేర్ ద్వారా ఓపీ సేవలు త్వరితగతిన పొందవచ్చన్నారు. జాతీయ స్థాయి మెడికల్ బృంద సభ్యులు డాక్టర్ పంకజ్ అరోరా, సౌరభ్ సింగ్, రితిక, బబిత, అబ్యుథయ్, గాంధీ నోడల్ అధికారి కళ్యాణ చక్రవర్తి, ఆర్ఎంఓలు డాక్టర్ రజనీ, మీనాక్షి, నజీమ్, సుదీర్, యోగి, నవీన్, సరిత, యూసుఫ్, కిరణ్, జగదీష్, చిరంజీవి, సుప్రియ, నరేష్, రాష్ట్ర బృందం దివ్య ,విమల, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి



వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు

పద్మారావునగర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచంద్రరావు అన్నారు. శుక్రవారం బోలక్‌పూర్ ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్న స్ఫూర్తిని విస్మరిస్తూ అనేక రోగాలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వ్యాయామం, యోగా, ధ్యానం ఇతరత్రా యాక్టివిటీస్ చేయాలన్నారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, బి. నర్సింగ్‌రావు, భారత్ వికాష్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నాగశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామ క్రిష్ణ పాల్గొన్నారు.

రైల్ నిలయం వద్ద ఫ్లాగ్‌మార్చ్



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ నేతృత్వంలో శుక్రవారం 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని అభినందిస్తూ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుంచి సంగీత్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ అండ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ ఎ.కె.రావత్, డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.ఆర్. షెల్కేలతో పాటు ఇతర అధికారులు, రైల్వే సిబ్బంది, దక్షిణ మధ్య రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లు,ఆర్పీఎఫ్ పాల్గొన్నారు.ఆపరేషన్ సింధూర్ విజయంపైన ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఉగ్రవాదాన్ని అణచివేయడంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన వ్యూహాత్మక శక్తి, పరాక్రమానికి సంఘీభావాన్ని తెలియజేసేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

10వేల కుటుంబాలకు భూ బదలాయింపుపై చర్చలు



సీఈవో, డీఈవోలతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

బోర్డు, రక్షణశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

రసూల్‌పురా: కంటోన్మెంట్ పరిధిలోని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ స్థలాల్లో దశబ్దాల నుంచి నివాసం ఉంటున్న పదివేల కుటుంబాలకు పట్టాల మంజూరు విషయమై కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీసర్ దినేష్‌రెడ్డితో నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం బోర్డు కార్యాలయంలో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం భూ బదలాయింపు విషయంలో సానుకూలంగా ఉందని బోర్డు పరిధిలోనియేయే వార్డుల్లో ఎంత విస్తీర్ణంలో పేదల బస్తీలు ఉన్నాయి, ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నారనే వివరాలు అందజేస్తే రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి వివరాలు సమర్పిస్తే భూ బదలాయింపు ప్రక్రియ చర్యలు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే ఇరువురు అధికారులకు వివరించారు. అధికారులతో సమావేశం అనంతరం శ్రీగణేష్ మాట్లాడుతూ ఇటీవల తాను కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ స్థలాల్లో ఉంటున్న పేదలకు పట్టాల మంజూరు విషయమై సంబంధీత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ను కలసి వినతి పత్రం ఇచ్చానని జిల్లా కలెక్టర్‌తో కూడ చర్చలు జరిపినట్లు. సీఈవో, డీఈవో అధికారులు సానుకూలంగా స్పందించారని త్వరలో భూబదలాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



సికింద్రాబాద్: ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్‌ను సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పరామర్శించారు. మెట్టుగూడలోని రైల్వే హాస్పిటల్‌లో చికిత్స పొందిన చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నేడు నిమ్స్‌లో ర్యాలీ

లక్డీకాపూల్ : అధిక రక్తపోటు దాని సమస్యల గురించి అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామని నిమ్స్ కార్డియాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ ఎస్.రమాకుమారి తెలిపారు. ఈ క్రమంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిమ్స్‌లో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ర్యాలీ నిమ్స్ బంజారాహిల్స్ వైపు గేటు నుంచి పంజాగుట్ట వైపు గేట్ వరకు కొనసాగుతుందని వివరించారు.

టి-శాట్‌ను సందర్శించిన ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: టి-శాట్‌ను ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఇతర అధికారులతో కలసి శుక్రవారం సందర్శించారు. గతంలో ఓయూతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం టీ-శాట్‌తో కలసి విస్తృతంగా పని చేయనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థులు టి-శాట్‌ను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వీసీ పేర్కొన్నారు. విద్యార్థులకు అకడమిక్ పాఠాలతో పాటు వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షలకు టి-శాట్ ద్వారా నిరుద్యోగులకు నిరంతరం బోధన జరుగుతుందని సీఈవో వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొ.లావణ్య, ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి, టి-శాట్ ఈడీ సాధిక్, జీఎం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.3,05 లక్షలు



సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని వివిధ ఆలయాలకు సంబంధించిన హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. మొత్తం 20 హుండీలకు సంబంధించి మొత్తం 56 రోజులకు గాను రూ.3,05,890ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఈఓ సత్యనారాయణనాయుడు పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రవీంద్రాచర్యులు, గోపాల్‌జోషి, రిపుంజయశర్మ, సుదర్శనాచార్యులు, సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏలో మహిళా ఉద్యోగుల కోసం ఆరోగ్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల ఆరోగ్యశిబిరాన్ని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. శనివారం కూడా ఈ హెల్త్ క్యాంపు నిర్వహించనున్నారు. కిమ్స్ హాస్పిటల్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులకు బ్రెస్ట్‌కేన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు.అలాగే అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.45 సంవత్సరాలు దాటిన మహిళలకు క్లినికల్ స్క్రీనింగ్‌లు ఎంతో అవసరమని కిమ్స్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్నేహ అన్నారు.ఈ సందర్భంగా పోర్టబుల్ కేన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత మామోగ్రామ్ ఇమేజింగ్ పరీక్షలు నిర్వహించారు.ఈ ఆరోగ్యశిబిరానికి అనూహ్యమైన స్పందన లభించింది. సుమారు 200 మంది మహిళలు వైద్యసేవలను పొందారు.

ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలి



ఓయూలో ఏబీవీపీ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టుల నిర్మూలనకు కేంద్రం ప్రవేశ పెట్టిన ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ నరగ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తు ఆపరేషన్ కగార్‌ను కొనసాగించాలని నినాదాలు చేశారు కార్యక్రమంలో ఏబీవీపీ నాయకలు పృథ్వీతేజ, అలివేలి రాజు, బాలు, నగేష్, అఖిల్ పాల్గొన్నారు.

ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు



మిర్జాల్‌గూడ టీ జంక్షన్ వద్ద చెక్‌పోస్టును సందర్శించిన ఇన్‌స్పెక్టర్ రఘుబాబు

అడ్డగుట్ట: పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రఘుబాబు మాట్లాడుతూ పీఎస్ పరిధిలోని లాలాపేట ఇసుక బావి, మిర్జాల్‌గూడ టీ జంక్షన్ వద్ద రెండు ప్రాంతాల్లో శుక్రవారం ఇంటర్ కమీషనరేట్ బక్రీద్ చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ వరకు ఈ చెక్‌పోస్ట్‌లు కొనసాగుతాయన్నారు.

తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తూ నేడు(శనివారం) నిర్వహించనున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బిజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిలు కోరారు. ఈ మేరకు శుక్రవారం చిలకలగూడ, సీతాఫల్మండి, ఉస్మానియా యూనివర్సిటీ తదితర ప్రాంతాలలో పర్యటించి 'చలో ట్యాంక్ బండ్ సెల్యూట్ ఫర్ ఆర్మీ' కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొనాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5గంటలకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి వివేకానంద విగ్రహం వరకు తిరంగా ర్యాలీ సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడనుందన్నారు. అలాగే యుద్ధంలో మరణించిన సైనికులకు నివాళులు అర్పించడం కూడా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు శివాజీ, శ్రవణ్ కుమార్, భాస్కర్ గిరి, అంబల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్,, బోండం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం



సాయికిరణ్

గాంధీఆస్పత్రి: చికిత్స కోసం వచ్చిన రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. అనిల్‌కుమార్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా నాగారంలో జ్యోతి రిహేబిలిటేషన్ సెంటర్‌లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నాడు. సెంటర్‌లో ఆశ్రయం పొందుతున్న ముగ్గురిని ఈనెల 11న చికిత్స నిమిత్తం గాంధీఆస్పత్రికి తీసుకువచ్చాడు. వీరిలో మద్యానికి అలవాటు పడిన సాయికిరణ్ (30) గాంధీఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కేర్‌టేకర్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ హముజా నాయక్ తెలిపారు.

మహిళ అదృశ్యం



రాధ

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన మేరకు..బాపూజీనగర్ జమ్‌జమ్ మసీదు ప్రాంతానికి చెందిన రాధ (54)కు ఇటీవల కంటి ఆపరేషన్ జరగడంతో నెల రోజులుగా ఇంటివద్దే ఉంటోంది. ఈనెల 12వ తేది రాత్రి 11.30 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కుమార్తె స్వప్న పోలీసులను ఆశ్రయించింది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంటమాలజీ విభాగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు

సనత్‌నగర్: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్ ఎంటమాలజీ విభాగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అమీర్‌పేట గవర్నమెంట్ హాస్పటల్ నుంచి ఉమేష్‌చంద్ర విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఇందులో అమీర్‌పేట డివిజన్ కార్పొరేటర్ సరళ హాజరై మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టి డెంగీ వంటి వ్యాధులు దరిచేరకుండా చూసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, డాక్టర్ హేమలత, స్వప్న, పీహెచ్ఎన్ మరియమ్మ, హెల్త్ అండ్ మలేరియా సూపర్‌వైజర్లు అలీ, ప్రభాకర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట: దోమ కాటు వలన వచ్చే డెంగీ వ్యాధిని ప్రజలందరి భాగస్వామ్యతో నిర్మూలిద్దామని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మే 16 జాతీయ డెంగీ డే సందర్భంగా తార్నాకలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డెంగీవాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపే కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటిద్దాం అని పిలుపునిచ్చారు. తద్వారా దోమల వ్యాప్తిని లార్వా దశలోనే నిర్మూలించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, అధికారులు దుర్గాప్రసాద్, రాజశేఖర్, ప్రదీప్, నర్సింగ్, జుబేర్, జాఫర్, ఫరూక్, మహ్మద్, అశోక్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సిబ్బంది పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఐడిహెచ్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ, ఉద్యోగం పేరిట మోసం

● బీటెక్ విద్యార్థికి నకిలీ ఆఫర్ లెటర్..
● శ్రీసాఫ్ట్ టెక్ టెక్నాలజీస్ నిర్వాహకుడిపై ఎస్సార్‌నగర్‌లో కేసు..

సనత్‌నగర్: నాణ్యమైన శిక్షణ అందిస్తాం..ఆపై ఉద్యోగ అవకాశం కల్పిస్తామంటూ ప్రకటనలు ఊదరగొట్టడమే కాకుండా మాయమాటలు చెప్పి ఓ బీటెక్ విద్యార్థిని నిలువునా మోసగించిన ఓ సాఫ్ట్ టెక్ టెక్నాలజీస్ నిర్వాహకుడిపై ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. విజయవాడలోని మధురానగర్‌కు చెందిన ఎర్రగబోయిన సుందర్‌రావు 2022లో బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. అయితే ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం మరింతగా పెంపొందించుకోవడంతో పాటు ఉపాధి అవకాశాన్ని పొందడం కోసం 2022 జూన్‌లో నగరానికి వచ్చాడు. అమీర్‌పేటలోని ఎస్‌కే ఎన్‌క్లేవ్‌లో ఉన్న శ్రీసాఫ్ట్ టెక్ టెక్నాలజీస్‌లో శాప్ (ఎంఎం) కోర్సులో శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ మేరకు శిక్షణ కోసం రూ.2.25 లక్షల ఫీజును చెల్లించిన అనంతరం మూడు నెలల్లో కోర్సు పూర్తయ్యింది. అయితే రాజ సుందరరావుకు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికిన శ్రీసాఫ్ట్ టెక్ టెక్నాలజీస్ నిర్వాహకుడు క్రాంతికుమార్ రూ.2.20 లక్షలు వసూలు చేశాడు. రూ.3.50 లక్షల వార్షిక వేతనంగా పేర్కొంటూ శ్రీ సాఫ్ట్ టెక్నాలజీస్ పేరుతో నియామక పత్రాన్ని అందజేశాడు. అయితే మొదటి నెలలో బాధితుడు రాజ సుందరరావును తన కార్యాలయంలోనే కూర్చొబెట్టి ప్రాథమిక శాప్ మాడ్యుల్స్ టాస్క్‌లను ఇచ్చాడు. మొదటి నెల రూ.15 వేల వేతనం ఇచ్చాడు. ఆ తర్వాత రెండు నెలలు ఎటువంటి వేతనం ఇవ్వలేదు. ఇదేమిటని ప్రశ్నించడంతో ప్రాజెక్టు ఆలస్యమైందని, చెల్లింపులు వాయిదా పడ్డాయంటూ కుంటుసాకులు చెప్పి బుకాయించాడు. అనుమానం వచ్చిన బాధితుడు విచారించగా శ్రీసాఫ్ట్ టెక్నాలజీస్ పేరిట ఎటువంటి బహుళజాతి సంస్థ లేదని తెలిసింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు గురువారం సాఫ్ట్ టెక్ టెక్నాలజీస్ సంస్థ నిర్వాహకుడు క్రాంతికుమార్‌పై కేసు నమోదు చేశారు.